సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



సంక్షేమానికి జై



ఉమ్మడి జిల్లాలో 13,200 మందికి దళితబంధు

కాళేశ్వరం టూరిజం సర్క్యూట్‌కు రూ.750 కోట్లు	కరీంనగర్ స్మార్ట్‌సిటీకి రూ.186 కోట్లు
నీటిపారుదల రంగానికి రూ.569 కోట్లకు పైగా ఫండ్స్	వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.50 కోట్లు

ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు రాష్ట్ర ఈక్విటీ కింద రూ.10 కోట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2023–24లో ఉమ్మడి జిల్లాలో సంక్షేమానికి పెద్దపీట వేసింది. బడ్జెట్‌లో కొత్త పథకాలు ఏమీ లేకపోయినా.. ఇప్పటికే కొనసాగుతున్న పలు పథకాలకు నిధులు దండిగా కేటాయించారు. వ్యవసాయం, సామాజిక సంక్షేమం, సామాజిక భద్రత, నీటిపారుదల, మున్సిపల్, పర్యాటక, ఆధ్యాత్మిక, విద్య, క్రీడా రంగాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా నిధులు విడుదల చేశారు. ఈ కేటాయింపుల్లో కొన్నింట్లో పెరుగుదల కనిపించగా.. మరికొన్నింట్లో తగ్గుదల నమోదైంది. నీటిపారుదల, శాంతిభద్రతలు, సంక్షేమానికి నిధుల్లో ప్రాధాన్యం కనిపించింది. ముఖ్యంగా రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ వంటి పథకాలకు ఎప్పటిలాగే పెద్దపీట వేయగా.. ఎన్నికల సంవత్సరం కావడంతో రైతుల కోసం నీటిపారుదల రంగానికి నిధులు పెంచారు. అలాగే.. దళితబంధుకు సైతం నిధుల్లో మంచి భాగస్వామ్యాన్నే కల్పించారు. పురపాలికలకు ఆర్థిక సాయం, స్మార్ట్‌సిటీలకు నిధుల్లోనూ పెద్దపీటే వేశారు. సొంతింటికి రూ.3 లక్షల ఆర్థిక సాయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నియోజకవర్గానికి 1,100 మందికి..



తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకం దళితబంధు. ప్రతీ దళితులను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చాలన్న ఉద్దేశంతో హుజూరాబాద్‌లో విజయవంతంగా అమలు చేశారు. ఉమ్మడి జిల్లాలో మిగిలినవి 12 నియోజకవర్గాలు. గతంలోలాగా నియోజకవర్గానికి 100 మందికి పరిమితం కాకుండా ఈసారి 1100 మంది చొప్పున ప్రభుత్వం సాయం ప్రకటించనుంది. ఈ లెక్కన 13,200 మందికి పథకాన్ని ఇవ్వనున్నారు. వీరికి ప్రతీ ఒక్కరికి రూ.10 లక్షల చొప్పున దాదాపు రూ.1,320 కోట్ల ఆర్థికసాయం అందించనున్నారు. ఈ పథకం అమలు కోసం గతేడాది దాదాపు రూ.1,800 కోట్లకుపైగా ఒక్క హుజూరాబాద్‌లోనే ప్రభుత్వం యూనిట్ల మంజూరుకు వెచ్చించింది.

సొంతింటికి రూ.3 లక్షలు..



డబుల్ బెడ్‌రూములు ఇప్పటికే జిల్లాల్లో వివిధ దశల్లో నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభానికి దగ్గరగా ఉన్నాయి. అదే క్రమంలో గతంలో ఇచ్చిన హామీ మేరకు స్థలం ఉన్న ప్రతీ అర్హులకు ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల సాయం చేస్తామని ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో స్థలం ఉండి.. ఇల్లు కట్టుకోలేని వారికి ఇది శుభవార్తే. కానీ, నిర్మాణ వ్యయం భారీగా పెరిగిన నేపథ్యంలో రూ.3 లక్షలు ప్రకటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే ధరపై ప్రభుత్వమే సబ్సిడీపై ఇంటి సామగ్రిని సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

పురపాలికలకు కేటాయింపులు ఇలా..



ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఆర్థిక సాయం కింద రూ.20 కోట్లు ప్రకటించింది. అయితే.. గతేడాది బడ్జెట్‌లో ఈ సాయం రూ.30 కోట్లుగా ఉండగా.. ఈ ఏడాది పద్దులో మాత్రం రూ.10 కోట్లు తక్కువగా కేటాయించారు.

కరీంనగర్ స్మార్ట్‌సిటీకి రూ.186.56 కోట్లు



కరీంనగర్ స్మార్ట్‌సిటీకి ప్రభుత్వం తన వంతు వాటాగా.. ఈ ఏడాది రూ.186.56 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలోని స్మార్ట్‌సిటీలకు మొత్తంగా రూ.373.14 కోట్లు కేటాయించగా.. సగం వరకు కరీంనగర్‌కు కేటాయించడం విశేషం. ఇప్పటికే స్మార్ట్‌సిటీ కింద కేంద్రం నుంచి వచ్చిన నిధులతో జంక్షన్ల సుందరీకరణ, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు తదితర పనులు వేగంగా సాగుతున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో పనులు మరింత వేగం పుంజుకోనున్నాయని మేయర్ సునీల్ రావు తెలిపారు. కేంద్ర రాష్ట్రం 50:50 ప్రాతిపదికన జరుగుతున్న పనుల్లో ఇంతవరకూ రూ.196 కోట్లు తెలంగాణ, మరో రూ.196 కోట్లు కేంద్రం నిధులు ఇచ్చాయి.

నిధులు	కేటాయింపు
కరీంనగర్ స్మార్ట్‌సిటీ	రూ.166.25 కోట్లు
ఎస్సీ, ఎస్టీ కింద	రూ.12.88 కోట్లు
టీఎస్పీ నిధుల కింద	రూ.7.43 కోట్లు
మొత్తంగా స్మార్ట్‌సిటీకి..	రూ.186.56 కోట్లు

క్రీడా స్కూల్ కోసం రూ.8 కోట్లకుపైగా..



ఉమ్మడి జిల్లా ఉజ్వలపార్క్ సమీపంలో ఎల్ఎండీ స్పోర్ట్స్ స్కూల్ కోసం ఈ ఏడాది రూ.16.53 కోట్లు కేటాయించారు. ఈ నిధులను టీఎస్ స్పోర్ట్స్ స్కూల్‌తో కలిసి పంచుకోవాల్సి ఉంటుంది. ఈ లెక్కన రూ.8.2 కోట్ల వరకు నిధులు రానున్నాయి. ఈ నిధులతో స్విమ్మింగ్‌పూల్, జిమ్నాజియం, బాక్సింగ్ ఇండోర్ హాల్, జుడో, రెజ్లింగ్ ప్రత్యేక హాలు, సింథటిక్ ట్రాక్ (మల్టీ పర్పస్ ట్రాక్), కోచ్‌లు, సదుపాయాల ఆధునికీకరణ, హకీంపేట తరహాలో క్రీడాకారులకు డైట్ తరహా సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఈ రెండు టీఎస్ స్పోర్ట్స్ స్కూళ్లకు కలిపి గతేడాది రూ.19.70 కోట్లు కేటాయించింది.

- ఇక రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాలకు రూ.500 కోట్లు కేటాయించింది. ఇందులో ఉమ్మడి జిల్లాలో ఉన్న శాతవాహన వర్సిటీకి ఎన్నినిధులు వస్తాయన్న దానిపై స్పష్టత లేదు.

పర్యాటకానికి ఊతం..



- కాళేశ్వరం టూరిస్ట్ సర్క్యూట్ కింద రూ.750 కోట్లు కేటాయించింది. కాళేశ్వరం దాని అనుబంధంగా ఉన్న పలు ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్ల పరిసరాల్లో పర్యాటకం అభివృద్ధికి ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా గోదావరిఖనిలో బోటింగ్, కనోయింగ్, కయాకింగ్ తదితర క్రీడల అభివృద్ధికి దోహదపడతాయి. ఇక లోయర్‌మానేరు, మిడ్‌మానేరు, అప్పర్ మానేరు రిజర్వాయర్ల పరిసరాల సుందరీకరణ, పర్యాటకులను ఆకట్టుకునేందుకు బోటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసుకునే వీలుంది. ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో కోటిలింగాల రేవు వద్ద గోదావరిలో పడవ ప్రయాణం పునఃప్రారంభించేందుకు వీలు చిక్కనుంది.

వేములవాడ ఆలయం అభివృద్ధికి రూ.50 కోట్లు



యాదాద్రి తరహాలో వేములవాడను ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానని సీఎం గతంలోనే ప్రకటించారు. ఈ మేరకు వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ)ను ఏర్పాటు చేసింది. గతంలో రూ.50 కోట్లు ప్రభుత్వం ఇచ్చింది. ఆ నిధులను భూసేకరణకు, జీతభత్యాలకే వినియోగించారు. టెంపుల్ కోసం పలు ఆనంద్‌సాయి, స్థపతి వల్లినాయగం నేతృత్వంలో పలుమార్లు గుడికి వచ్చి.. కొన్ని డిజైన్లు పరిశీలించినా.. ఏదీ ఖరారు చేయలేదు. తాజాగా రూ.50 కోట్లు కేటాయించడంతో దక్షిణకాశీ అభివృద్ధిపై తిరిగి ఆశలు చిగురించాయి.

- చేనేత బీమాకు ఈ బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించింది. ఆకస్మికంగా చేనేత కార్మికులు మరణిస్తే.. వారి కుటుంబాలకు పదిరోజుల్లోగా రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తానని ప్రకటించింది.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు రూ.10 కోట్లు..

- రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్)కు రాష్ట్రం రూ.10 కోట్లు కేటాయించింది. స్టేట్ ఈక్విటీ కింద తన వంతుగా ఈ నిధులు కేటాయించింది.

నీటి ప్రాజెక్టులకు.. రూ.569 కోట్లకుపైగా..!

గతేడాదితో పోలిస్తే.. ఈ ఏడాది సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల్లో పెరుగుదల నమోదైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు చిన్న, మధ్య, తరహా ప్రాజెక్టుల నిర్వహణకు గతేడాది రూ.451 కోట్లు విడుదల చేయగా.. ఈ ఏడాది ఆ నిధులు రూ.569.79 కోట్లకు చేరుకుంది.



ప్రాజెక్టు/ఆఫీస్	ఈ ఏడాది	గతేడాది
శ్రీపాదఎల్లంపల్లి	రూ.349.43 కోట్లు	రూ.273.02 కోట్లు
బొగ్గులవాగు(సీఈ)	రూ.32.00 లక్షలు	రూ.65 లక్షలు
మానేరు ప్రాజెక్టు	------	------
శనిగరం (సీఈ)	రూ.65 లక్షలు	-----
వరద కాలువకు	రూ.219.39 కోట్లు	రూ.177.15 కోట్లు
రామడుగు (గోదావరి బేసిన్)	రూ.2.18 కోట్లు	----

జాడలేనివి ఇవే..!

- గతేడాది డిసెంబరు7వ తేదీన జగిత్యాలకు సీఎం కొండగట్టుకు రూ.100 కోట్లు ఇస్తానని ప్రకటించారు. వాస్తవానికి దేవాలయాభివృద్ధికి ప్రభుత్వం దాదాపు 380 ఎకరాలు కేటాయించింది. ఈ బడ్జెట్‌లో రూ.100 కోట్లు ప్రకటిస్తారని ఆశించినా.. దీనిపై స్పష్టత రాకపోవడం భక్తులను నిరాశపరిచింది. అలాగే ధర్మపురి ఆలయాభివృద్ధిపైనా స్పష్టత రాలేదు.
- బసంత్‌నగర్ విమానాశ్రయంపై మొన్న కేంద్ర బడ్జెట్‌లోనూ, తాజాగా రాష్ట్ర బడ్జెట్‌లోనూ ఎలాంటి ప్రకటన రాకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది.

జనరంజక బడ్జెట్



బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజలు అభినందించేలా ఉంది. ముఖ్యంగా ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేశారు. రాష్ట్ర బడ్జెట్‌ను దేశప్రజలు స్వాగతిస్తున్నారు. ఇంతటి జనరంజకమైన బడ్జెట్ ఏ ప్రభుత్వం ప్రవేశపెట్టలేదు.

– తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

రాజన్నను విస్మరించారు



వేములవాడ రాజన్నను ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి విస్మరించారు. ఆలయ అభివృద్ధికి ఏటా బడ్జెట్‌లో రూ.100కోట్లు కేటాయిస్తామన్న హామీ ఇప్పటి వరకు నెరవేరలేదు. బీసీబంధు, గిరిజన బంధు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిరుద్యోగభృతి హామీలకు స్థానం లేదు. బడ్జెట్ అంకెల గారడీగా ఉంది.

– ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు

కొత్త స్కీమ్స్ లేవు



పాత సీసాలో కొత్త సారా అన్నట్లుగా బడ్జెట్ ఉంది. ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రసంగంలో కొత్తదనమేమీ కనిపించలేదు. ఎన్నికల ఏడాది అయినప్పటికీ ఎలాంటి కొత్త పథకాలు లేక ప్రసంగం చప్పగా సాగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ఉంది. ఏ ఒక్కరికి పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదు. కేవలం ఎన్నికలు సమీపిస్తున్నందున ఇలాంటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

– చొక్కాల రాము, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు

ఊరటనిచ్చే బడ్జెట్ కావాలి



సామాన్యులపై పన్నుల భారం తగ్గించేలా బడ్జెట్ ఉండాలి. మెరుగైన విద్య, వైద్యం అందించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలి. పేదలకు కనీస సౌకర్యాలు పొందాలంటే వస్తువుల ధరలు తగ్గించాలి. రైతుల రుణమాఫీ చేయాలి.

– రేవెజు సదానందం, ఉపాధ్యాయుడు

కార్మికుల సంక్షేమం మరిచిపోయింది



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమం మరచిపోయింది. చేనేత, పవర్‌లూమ్ పరిశ్రమలకు తగిన బడ్జెట్ కేటాయించలేదు. కార్మికులకు, చేతివృత్తులకు బడ్జెట్‌లో న్యాయం జరగలేదు. టెక్స్‌టైల్ పార్కుకు సంబంధించి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం సరికాదు.

– మూశం రమేశ్, సీపీఎం జిల్లా కార్యదర్శి

న్యూస్‌రీల్

‘డబుల్’ ఇళ్ల కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ సుమన్

తంగళ్లపల్లి(వేములవాడ): తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాల కోసం సోమవారం పంచాయతీరాజ్ ఏఈ సుమన్ ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. సొంత భూమి కలిగి ఉండి ఇల్లు లేనివారికి ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రకటించిన నేపథ్యంలో.. సొంత భూమి కలిగి ఇల్లు లేని అర్హులకు సంబంధించిన భూమిని పరిశీలించి స్థలం కొలతలు నమోదు చేసుకున్నారు. వైస్‌ఎంపీపీ జంగిటి అంజయ్య, సర్పంచ్ నీరటి లక్ష్మి, నాయకులు నీరటి బాబు, కార్యదర్శి పి.వెన్నెల పాల్గొన్నారు.

మార్కెట్ కోసం స్థల సర్వే



హద్దులు పాతుతున్న అధికారులు

వేములవాడరూరల్: వేములవాడ నూతన మార్కెట్ కోసం సోమవారం అధికారులు స్థల సర్వే చేపట్టారు. మండలంలోని మర్రిపల్లి శివారులోని సర్వేనంబర్ 748 గల ప్రభుత్వ అసైన్ భూముల్లో వేములవాడ నూతన మార్కెట్ కమిటీ నిర్మాణం చేపడుతున్నారు. గత పాలకవర్గం ఉన్న సమయంలో తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రస్తుత కొత్త మార్కెట్ కమిటీ పాలకవర్గం ఆ పనులను చేపట్టేందుకు ముందుకొచ్చింది. మార్కెట్ కమిటీ నుంచి రూ.2కోట్లు, ప్రభుత్వం ఇస్తున్న రూ.20 కోట్లతో పనులు చేపట్టనున్నారు. 13.5 ఎకరాలు తీసుకునేందుకు సర్వే చేపట్టి, హద్దులు నిర్ణయించారు. ఈ సర్వేలో మార్కెట్ కమిటీ కార్యదర్శి సత్యనారాయణ, సర్వేయర్ విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ గతేడాది అనారోగ్యంతో మరణించిన ఉపేందర్ కుటుంబానికి కార్పస్‌ఫండ్ చెక్కును ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలు అందేలా చూడాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



పనులు పరిశీలిస్తున్న జిందం కళ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లలోని వెంకంపేట ప్రధాన రహదారి వెంబడి నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ సోమవారం భూమి పూజ చేశారు. పెద్దూరులో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో చేపడుతున్న వసతి పనులను పరిశీలించారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు రాపెల్లి అరుణ, కల్లూరి లత, గెంట్యాల శ్రీనివాస్, దిడ్డి మాధవి, ఆకుల కృష్ణ పాల్గొన్నారు.

శివదీక్షలు ప్రారంభం



వేములవాడ: రాజన్న సన్నిధిలో 11 రోజుల శివదీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. దాదాపు వందకు పైగా భక్తులు శివదీక్షలు స్వీకరించారు.

బీజేపీతో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

- ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం
- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



సిరిసిల్లలోని ఎల్‌ఐసీ ఆఫీస్ ముందు ధర్నా చేస్తున్న కాంగ్రెస నాయకులు

సిరిసిల్లటౌన్/చందుర్తి(వేములవాడ): బీజేపీతో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆరోపించారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఏఐసీసీ పిలుపు మేరకు సిరిసిల్లలోని ఎల్ఐసీ ఆఫీస్ ముందు సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడంతో ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందన్నారు. ఎగవేతదారులకు మోదీ అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణగౌడ్, పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగం కుమార్, సర్పంచ్ కదిరె రాజు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, కిసాన్ సెల్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, జలగం టోని, బాల్‌రెడ్డి, ఫిరోజ్‌పాషా, కనకయ్య, రామస్వామి పాల్గొన్నారు.

ప్రజలను ఏకం చేసేందుకే పాదయాత్ర

కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీలను రానున్న ఎన్నికల్లో ప్రజలు బొంద పెట్టాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. చందుర్తి మండలం మర్రిగడ్డలో సోమవారం హాత్ సే హాత్ జోడో పాదయాత్రను ప్రారంభించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేపట్టిన పాదయాత్ర స్ఫూర్తితో ఈ పాదయాత్రను కొనసాగిస్తామన్నారు. ప్రజలను ఏకం చేసేందుకే ఈ పాదయాత్ర అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారంలో విఫలమైందన్నారు. జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, గ్రామ సర్పంచ్ నేతికుంట జలపతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టే ప్రభాకర్, జిల్లా కార్యదర్శి ఇందూరి మధు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బానాల రవీందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ వేములవాడ నియోజక వర్గ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగొద్దు



జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఈనెల 17 నుంచి మూడు రోజులపాటు జరిగే మహాశివరాత్రి జాతర మహోత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఆలయంలో జాతర ఉత్సవాల ఏర్పాట్లను సోమవారం ఈవో కృష్ణప్రసాద్, డీఎస్పీ నాగేంద్రాచారి, ఈఈ రాజేశ్‌లతో కలసి పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలన్నారు. ట్రాఫిక్ కంట్రోల్ చేస్తూ పార్కింగ్ స్థలాలకు పంపించాలన్నారు. ఎక్కడా ట్రాఫిక్‌జామ్ కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల క్యూలైన్లు, పార్కింగ్, ఆలయ పరిసరాలు, ఆలయంలోని పరిసరాలు, గుడి చెరువు ఖాళీ స్థలం, కళాభవన్, కల్యాణకట్ట, ప్రసాదాల కౌంటర్లను పరిశీలించారు.



శంభో శంకర



వేములవాడ: రాజన్నను సోమవారం 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసి కల్యాణకట్టలో తలనీలాలు, ఆలయ ఆవరణలో నిలువెత్తు బెల్లం, రాజన్న కోడె, కల్యాణాలు, అభిషేకాలు, అన్నపూజలు, సత్యనారాయణ వ్రతాలు, అమ్మవారికి కుంకుమపూజలు చేశారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు పరిశీలించారు. భక్తుల ద్వారా రూ.30 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

కరెంట్‌షాక్‌తో రైతు మృతి



చెప్యాల నడిపి బాబు మృతదేహం

గంభీరావుపేట(సిరిసిల్ల): కూరగాయల తోటకు నీరు పెట్టడానికి వెళ్లి కరెంటు షాక్‌కు గురై రైతు మృతిచెందిన సంఘటన గంభీరావుపేట మండలం నాగంపేటలో సోమవారం చోటుచేసుకుంది. నాగంపేటకు చెందిన చెప్యాల నడిపి బాబు(56) తన వ్యవసాయ భూమిలో టమాట సాగుచేశాడు. రాత్రి పూట వెలుతురు కోసం అక్కడ విద్యుత్ బల్బు ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం ఉదయం తోటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. తోటలో బల్బు కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నం వరకు బాబు ఇంటికి రాకపోవడంతో వెళ్లి చూసేసరికి మృతిచెంది కనిపించాడు. మృతుని భార్య ఎల్లవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలంలోని మద్దిమల్ల లొద్దితండాకు చెందిన మాలోతు శంకర్(45) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు. కొన్ని నెలలుగా శంకర్ దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం కూడా గొడవ కావడంతో మనస్తాపానికి గురైన శంకర్ గ్రామ శివారులోని తుంగచెరువు కట్ట ఏరియాలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య లక్ష్మి, కొడుకు సీనా, కూతుళ్లు కావేరి, సంధ్య ఉన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని ముచ్చర్లతండాకు చెందిన మాలోతు శాలి(60) అనే వృద్ధురాలు ఈనెల 4న అదృశ్యమైంది. భర్త మాలోతు పంతులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. భూమి విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. ఈనెల 4న కూతుళ్ల ఇంటికెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లినట్లు భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోన్‌చేసి కూతుళ్లను అడిగితే అక్కడికి రాలేదని చెప్పినట్లు తెలిపారు. రెండు రోజులుగా ఆమె కోసం బంధువుల ఇళ్లలో, చుట్టుపక్క గ్రామాల్లో వెదికినా ఆచూకీ లభించలేదు. ఈమేరకు భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కోరెం గ్రామ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై పుల్లా అభిలాష్ తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ కనిపించడంతో అనుమానం వచ్చి ఆపడంతో ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడని అన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

విన్నపాలు వినవలె..

- ప్రజావాణికి 19 దరఖాస్తులు
- పరిష్కరించాలంటూ అడిషనల్ కలెక్టర్ల ఆదేశం



దరఖాస్తులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్లు బి సత్యప్రసాద్, ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పలు ప్రాంతాల ప్రజల నుంచి 19 దరఖాస్తులను అడిషనల్ కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఖీమ్యానాయక్‌లు స్వీకరించారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో శ్రీనివాస్‌రావు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా కల్పించండి



దరఖాస్తు ఇస్తున్న ఆధ్య తల్లిదండ్రులు

మా ఇద్దరు కూతుళ్లు పుట్టుకతోనే దివ్యాంగులు. చిన్నప్పటి నుంచి అనారోగ్యాల బారిన పడ్డారు. ఇటీవల ఒకపాప చనిపోయింది. మరోపాప కూడా అనారోగ్యంతో బాధపడుతోంది. దివ్యాంగురాలైన మా పాప ఆధ్యకి పెన్షన్ కోసం దరఖాస్తు చేసిన మంజూరు కావడం లేదు. చాలాసార్లు అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయింది. పెన్షన్ మంజూరు చేసి, ఆర్థికంగా ఆదుకోవాలి.

రైతుబీమా రాలేదు



దరఖాస్తు చేస్తున్న బాధితురాలి బంధువు

గతేడాది 9వ నెలలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లికి చెందిన మహిళా రైతు బైరి పద్మ మృతి చెందింది. రైతుబీమా కోసం దరఖాస్తు చేసిన ఇంతవరకు రాలేదు. పలుసార్లు సంబంధిత అధికారులకు అన్ని వివరాలతో దరఖాస్తు చేశా. అయినా తిరస్కరిస్తున్నారు. నాలుగు నెలల నుంచి తిరుగుతున్నం ఎవరు పట్టించుకోవడం లేదు. రైతుబీమా అందేలా చర్యలు తీసుకోవాలి.

ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్లలో డబుల్ బెడ్రూం ఇళ్లకు అర్హులై డ్రాలో పేర్లు రాని నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. కేవలం 1,800 మాత్రమే డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించారు. ఇంకా 1200 మంది అర్హులైన నిరుపేదలున్నారు. వీరందరికీ ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందజేయాలి.

నష్టపరిహారం అందించాలి



కలెక్టరేట్‌కి వచ్చిన సర్దాపూర్ రైతులు

సర్దాపూర్‌లోని సర్వే నం.61లో 12 ఎకరాల భూమిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 12 మందికి కేటాయించింది. అప్పటి నుంచి సాగు చేసుకుంటున్నాం. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం 17వ పోలీస్ బెటాలియన్‌కి కేటాయించింది. మాకు నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి నాలుగేళ్లు గడుస్తుంది. ఇంతవరకు ఎలాంటి పరిహారం అందజేయలేదు. పలుమార్లు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన ఫలితం లేదు. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి

సీపీఎస్‌పై కేంద్రం వైఖరి సరికాదు

- టీటీయూ జిల్లా అధ్యక్షుడు రవి



మాట్లాడుతున్న టీటీయూ నాయకులు

సిరిసిల్లఎడ్యుకేషన్: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం అమలులో కేంద్ర ప్రభుత్వ విధానం సరికాదని టీటీయూ జిల్లా అధ్యక్షుడు కొండికొప్పుల రవి పేర్కొన్నారు. సీపీఎస్ విధానాన్ని భేషరతుగా రద్దు చేయాలని కోరారు. సిరిసిల్లలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్ నుంచి స్వచ్ఛందంగా వైదొలిగే అవకాశం రాష్ట్రాలకు ఇస్తున్నామంటూనే.. నిర్ణయం తీసుకునే రాష్ట్రాలపై బ్లాక్ మెయిలింగ్ ధోరణితో వ్యవహరించడం సమంజసం కాదన్నారు. పాత విధానం అమలు చేస్తున్న రాష్ట్రాలకు తోడ్పాటు ఇవ్వాల్సిన కేంద్రం ఆంక్షలతో అడ్డుకోవడం సరికాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తడుకల సురేశ్, బంటు బాలకిషన్, సుధాకర్‌రెడ్డి, కరికె నరేందర్, గోక యాదగిరి, చిరంజీవి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు కేటీఆర్‌కు ఆహ్వానం



కేటీఆర్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న సర్పంచ్

గంభీరావుపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో ఈనెల 10వ తేదీ నుంచి జరిగే దుర్గమ్మ గిద్దెచెరువు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు హాజరు కావాలని మంత్రి కేటీఆర్‌కు సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి సోమవారం ఆహ్వానించారు. ఈమేరకు ఆహ్వానపత్రిక అందజేశారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ముస్తాబాద్ ఎంపీపీ జనగామ శరత్‌రావు, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ గోపాల్‌రావు, ఏఎంసీ చైర్మన్ కొండ రమేశ్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి



మాట్లాడుతున్న గాలి తిరుపతి

వేములవాడఅర్బన్: టైలర్ వృత్తిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని తెలంగాణ టైలర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గాలి తిరుపతి అన్నారు. వేములవాడలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ సాధన ఉద్యమంలో తమవంతు కృషి ఉందన్నారు. తెలంగాణ వస్తే తమ బతుకులు బాగుపడుతాయని ఎదురుచూశామని, కాని తమను పట్టించుకునే వారే కరువయ్యారని తెలిపారు. 50 ఏళ్లు దాటిన టైలర్ వృత్తిదారులకు భరోసా పెన్షన్ అందించాలన్నారు. ఇల్లు లేని వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో వెంకటేశ్, దశరథం, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు విద్యార్థుల ఆత్మహత్య

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో సోమవారం వేర్వేరు కారణాలతో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. సిరిసిల్లలో చదువుకోవాలని మందలించినందుకు విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా.. కోరుట్ల మండలం నాగులపేటలో కాలు నొప్పి భరించలేక, జమ్మికుంటలో పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని మనస్తాపంతో విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.

సిరిసిల్లక్రైం: బలాదూర్ తిరగొద్దని.. చదువుకోవాలని సూచించినందుకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. సంతానం లేరని దత్తత తీసుకుని పెంచుకుంటున్న కొడుకు ఇలా అర్ధంతరంగా ఆత్మహత్య చేసుకోవడంతో ఆ అమ్మ ఒంటరి అయ్యింది. సిరిసిల్లలోని బీవైనగర్‌కు చెందిన సద్గుణ-దేవేందర్‌కు సంతానం లేరు. చాలా ఏళ్ల క్రితం భాస్కర్‌ను దత్తత తీసుకున్నారు. కొడుకును ఉన్నత చదువులు చదివించాలని సిరిసిల్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించారు. కరోనా కాలంలో తండ్రి దేవేందర్ అనారోగ్యంతో మృతిచెందాడు. భాస్కర్ చదువు బాధ్యతలు తల్లిపై పడ్డాయి. తండ్రి లేడని కొడుకును కాస్త గారాబం చేస్తే.. భాస్కర్ బలాదూర్‌గా తిరిగాడు. ఇంటి పరిస్థితిని వివరిస్తూ 9వ తరగతి చదువుతున్న కొడుకుకు బుద్ధి చెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన భాస్కర్(17) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు.

నాగులపేటలో ఇంటర్ విద్యార్థిని..



కడప వైష్ణవి(ఫైల్)

కోరుట్లరూరల్: కోరుట్ల మండలం నాగులపేటకు చెందిన ఇంటర్ విద్యార్థిని కడప వైష్ణవి (17) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వైష్ణవి మెట్‌పల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న ఆమెకు ఇటీవల కాలు బెనకడంతో ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. అయితే కాలు నొప్పి భరించలేక, మనస్తాపం చెంది సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబసభ్యులు వచ్చి గమనించేలోపే మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తన కూతురు కాలునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుందని తండ్రి దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జమ్మికుంటలో పదోతరగతి విద్యార్థిని..



జాగృతి (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): పరీక్షలో మార్కులు తక్కువ వచ్చాయని మనస్తాపంతో ఓ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాలు.. జమ్మికుంట పట్టణంలోని ఆరెల్లి శ్రీనివాస్-అరుణ దంపతులు పిండిగిర్నీ నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వీరి కూతురు జాగృతి(15) పట్టణంలో ఓ ప్రైవేటు స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ఇటీవల ప్రీ ఫైనల్ పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయి. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు రాత్రి 10 గంటల తర్వాత పని ముగించుకొని ఇంటికి వచ్చి చూడగా ఉరేసుకొని కనిపించింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కూతురు మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడం పలువురిని కంటతడి పెట్టించింది. టౌన్ సీఐ రామచందర్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలి కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, దేశిని కోటి, శ్రీపతి నరేష్, దయ్యాల శ్రీనివాస్ సంతాపం తెలిపారు.

పెరిగిన 'గౌరవం'

- మధ్యాహ్న భోజన వంట కార్మికులకు వేతనం పెంపు
- రూ.3 వేలకు పెంచుతూ ఉత్తర్వులు
- జిల్లాలో 650 మందికి లబ్ధి



ముస్తాబాద్‌లో వంట నిర్వహణ కార్మికులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఏళ్లుగా చాలీచాలని గౌరవ వేతనంలో బతుకులు ఈడుస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికులను ప్రభుత్వం ఎట్టకేలకు గుర్తించింది. కనీస గౌరవ వేతనం అందించేందుకు నిర్ణయించింది. నెలకు రూ.వెయ్యి ఉన్న గౌరవ వేతనాన్ని రూ.3వేలకు పెంచుతూ జీవో 8 జారీ చేసింది. ఇంతకాలం ఎంతో మందికి భోజనాలు పెట్టిన కార్మికులు తమ పొట్ట ఎప్పుడు నిండుతుందోనంటూ పంటి బిగువున బాధలు భరిస్తూ పనిచేశారు. నెలకు కేవలం రూ.వెయ్యి గౌరవ వేతనం పొందారు. అది కూడా ఎప్పుడొస్తుందో తెలియని అయోమయ జీవితాలను వెల్లదీశారు. కొన్నేళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న ఉద్యమాలు, పోరాటాలకు ప్రభుత్వం ఎట్టకేలకు కనికరించింది. దీంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

650 మంది కార్మికులకు లబ్ధి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేల మంది విద్యార్థులకు నిత్యం పోషకాహారన్ని వండి వడ్డిస్తున్న కార్మికులకు నెలకు రూ.3వేల గౌరవ వేతనం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ బడ్జెట్‌లో కార్మికులకు రూ.3 వేల వేతనమంటూ ప్రకటన కూడా చేసింది. ఇక నుంచి నెలకు రూ.3వేల వేతనం అందించే ప్రక్రియ కొనసాగనుంది. దీంతో జిల్లాలో 650కి పైగా ఉన్న కార్మికులకు లబ్ధి చేకూరనుంది.

నిర్వహణ భారం..

ఒక పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ మామూలు విషయం కాదు. వందల సంఖ్యలో ఉన్న విద్యార్థుల కోసం భారీగా పెద్ద పెద్ద పాత్రలలో వంట చేయాల్సి ఉంటుంది. అందులో మహిళలు, వృద్ధులే పెద్ద పెద్ద అండాలను దించడం, వారే కట్టెలు, నీరు తెచ్చుకోవడం చేస్తున్నారు. కూరగాయలు, కోడిగుడ్లు, వంట చేసేందుకు కావాల్సిన సరుకులు అన్ని కొనుగోలు చేసుకొని పాఠశాలలకు తరలించాలి. ఇవన్నీ సమకూర్చుకున్న ప్రభుత్వం ప్రతినెలా సరుకుల బిల్లులు చెల్లించదు. కిరాణ దుకాణాల్లో అప్పులు చేసి సరుకులు తీసుకుంటుండగా కొన్ని దుకాణాల్లో వాటికి వడ్డీలు వేస్తున్నారు. కోడిగుడ్లు, కూరగాయలు, నూనెలు, పప్పుల ధరలు పెరిగితే ప్రభుత్వానికి సంబంధం ఉండదు. వంట ఏజెన్సీ కార్మికులే వాటిని భరించాలి. అదే అంగన్‌వాడీల్లో వంట నిర్వహణ అంతా ప్రభుత్వమే చూసుకుంటోంది. వందల మంది విద్యార్థులు చదివే పాఠశాలలను విస్మరిస్తోందనే అపవాదు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నెలకు రూ.400 వేతనం మాత్రమే ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే మిగితా రూ.2400 కలుపుతోందని బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు స్పష్టం చేస్తున్నారు. ఇందులో 9, 10 తరగతుల విద్యార్థుల బిల్లులు మరోలా చెల్లిస్తున్నారు.

జిల్లాలో పాఠశాలలు

ప్రాథమిక	336
జెడ్పీ ఉన్నత	109
ప్రాథమికోన్నత	38
మోడల్ స్కూల్స్	13
మధ్యాహ్న భోజన కార్మికులు	650 మందికి పైగా

మంచి జరుగుతుందనే..

ఇరవై ఏళ్లకు పైగా వంటలు చేస్తున్న మహిళలు మంచి రోజులు వస్తాయంటూ ఇన్నాళ్లుగా ఎదురుచూస్తున్నారు. బిల్లులు సరిగా రాక, అప్పులు చేసి వంట సరుకులు తెచ్చుకోవడం, గౌరవ వేతనం కూడా రూ.వెయ్యి మాత్రమే ఉండడంతో ఏళ్లుగా అనేక పోరాటాలు చేశారు. చివరకు రాష్ట్ర ప్రభుత్వం కనికరించి వారి హక్కులను కాపాడేలా రూ.3వేల వేతనం ఇస్తోంది.

ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న



ఇరవై ఏళ్లుగా వంటలు చేస్తున్న. నెలకు రూ.200 ఇచ్చేవాళ్లు. పిల్లలకు వంటలు చేసి పెట్టడం తృప్తిని ఇచ్చినా మా కడుపు చూసే వారు లేరు. ఇప్పుడు నెలకు రూ.3వేలు అంటున్నరు. సంతోషం. మా కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– పర్స వెంకటవ్వ, ముస్తాబాద్

కార్మికుల శ్రమను గుర్తించారు



వంట కార్మికుల కష్టాన్ని గుర్తించి కొంత వేతనం పెంచారు. కైకిలి పోతే రోజుకు రూ.500 వస్తయి. అలాంటిది పొద్దుగాళ్ల నుంచి మధ్యాహ్నం వరకు కష్టపడితే రూ.100 కూడా పడుతలేవు. సర్కార్ గుర్తిస్తదనే ఇన్నాళ్లు పనిచేస్తూ వచ్చాం. రూ.5 వేలు చేస్తే మంచిగుండు.

– బైరగోని నర్సవ్వ, ముస్తాబాద్

సీఎంకు ధన్యవాదాలు



ఏళ్లుగా పోరాటాలు చేశాం. రోజుకు రూ.30 వేతనంతో పనిచేయడం ఎక్కడ ఉండదు. ఇప్పటికైనా నెలకు రూ.3 వేల గౌరవ వేతనం ఇస్తున్నారు. ఇంకా మా సమస్యలు అనేకం ఉన్నాయి. వేతనాలు పెంచిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు.

– సంతోష, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



అక్షయను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట(సిరిసిల్ల): బీహర్‌లని పాట్నాలో ఈనెల 10, 11, 12 తేదీల్లో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అక్షయ ఎంపికైంది. నవంబర్‌లో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో(షాట్‌పుట్) అక్షయ అద్భుత ప్రతిభ కనబర్చి ఆలిండియా ఇంటర్ డిస్ట్రిక్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. హెచ్‌ఎం శంకర్, పీఈటీ భాను అభినందించారు.

నీటి విడుదలతో పంటలకు ప్రాణం



నీరు విడుదల చేస్తున్న నాయకులు

చందుర్తి(వేములవాడ): చందుర్తిలోని 450 రిజర్వాయర్ ట్యాంక్ కుడి కాలువ నుంచి ఎల్లంపల్లి నీటిని సోమవారం విడుదల చేశారు. పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఆదేశాలతో అధికారులు నీటిని విడుదల చేశారు. చందుర్తి సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, మండల కో-ఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, నాయకులు సిరికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి పూర్వ విద్యార్థుల సాయం



ముస్తాబాద్(సిరిసిల్ల): పోతుగల్‌కు చెందిన మేర చందు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. చందుకు మెరుగైన వైద్యం కోసం పూర్వ విద్యార్థులు సోమవారం ఆర్థికసాయం చేశారు. 1984-85 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.78వేలు పోగుచేసి చందుకు అందజేశారు. తమతో కలిసి చదువుకున్న చందు పూర్తి ఆరోగ్యాన్ని పొందాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పామని విశ్వనాథ్, మల్లేశం తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో మధ్యాహ్న భోజన వంట కార్మికులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. నెలకు రూ.3వేల వేతనాలు పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్పీని కలిసిన ఏజీపీ



ఎస్పీ అఖిల్ మహాజన్‌కు మొక్క అందజేస్తున్న ఏజీపీ గుడిసె సదానందం

వేములవాడ: ఎస్పీ అఖిల్ మహాజన్‌ను వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు ఏజీపీ గుడిసె సదానందం సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందజేశారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

వేములవాడరూరల్: కారు ఎంగేజ్‌కి తీసుకుని తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వేములవాడరూరల్ ఎస్సై నాగరాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. వేములవాడరూరల్ మండలం నమిలిగుండుపల్లికి చెందిన గడిపెల్లి శ్రావణ్‌కుమార్ వద్ద డిసెంబర్ 30న కారును నెలకు రూ.28 వేలకు ఎంగేజ్‌కు కొదురుపాకకు చెందిన మానువాడ శివవర్మ తీసుకున్నాడు. కారును తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న శివవర్మతోపాటు లక్క రాజు, అనంతారం గ్రామానికి చెందిన దోమకొండ నూతన్‌లపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

పేదలకు విందు భోజనం పంపిణీ



భోజనం పంపిణీ చేస్తున్న ధరణి సంస్థ నిర్వాహకురాలు

సిరిసిల్ల: సిరిసిల్లలోని కార్మికక్షేత్రంలో పేదలకు విందు భోజనాన్ని ధరణి స్వచ్ఛంద సంస్థ సోమవారం పంపిణీ చేసింది. కార్గిల్‌లేక్ వద్ద నరేశ్, వాసం శ్రీనివాస్, మమతల ఇంట్లో జరిగిన వేడుకల్లో మిగిలిన భోజనాన్ని ధరణి సంస్థ సేకరించింది. ఆ భోజనాన్ని తారకరామానగర్, గణేశ్‌నగర్‌లోని 150 మంది పేదలకు పంపిణీ చేశారు. ధరణి సంస్థ వ్యవస్థాపకురాలు వింధ్యారాణి, జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ స్టడీసర్కిల్‌కు బుక్స్ అందజేత



బీసీ స్టడీ సర్కిల్‌కు బుక్స్ అందిస్తున్న డీపీఆర్వో దశరథం

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌కు జిల్లా ప్రజాసంబంధాల అధికారి మామిండ్ల దశరథం సోమవారం స్టడీ మెటీరియల్ అందించారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు పోటీపరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను బీసీ స్టడీ సర్కిల్ లైబ్రరీకి ఇచ్చారు. పుస్తకాలు అందించిన డీపీఆర్వోకు స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి కృతజ్ఞతలు తెలిపారు.